తీసేవుంది' అని కేక వినపడగానే, గబగబా లోపలికి వెళ్ళింది.

వసారాలో నాపమీద శవం—ఆ శవం ప్రక్కనే, తలవంచుకొని దుఃఖిస్తూ తన భర్తా—మందువా దగ్గర దిగాలుపడి కూర్చుని బంట్రోతూ కనపడ్డారు.

భర్త తలయెత్తి తనవంక చూసి, „నువ్వా!" అని, వ్రేలితో శవాన్ని చూపించాడు.

ఆ శవం ఎవరో అని కనకం దగ్గరకు వెళ్ళింది.

నిన్నరాత్రి తనదగ్గరకు వచ్చినప్పుడు ఎలావుందో, అలాగేవుంది. విషం తాగింది కాబోసు!"

„అయ్యో! ఇంతపని చేస్తుందనుకోలేదు. నిన్నరాత్రి పన్నెండింటికివచ్చి, నన్ను వెంటనే మీదగ్గరికి రమ్మని బ్రతిమాలింది!" అని కనకం అంటూండగానే, ఆమెభర్త లేచి „పన్నెండు గంటలకా!" సరిగ్గా ఆ సమయానికే దాని ప్రాణాలు పోయాయి. సరిగ్గా పన్నెంటిండికే!" అన్నాడు.

„నిజమే! అంటూ విస్తుపోయింది కనకం. కాని రెండు నిమిషాలలో ఆమెకు ఏమర్థమయిందో, „ఎంత ప్రేమగలదానివే, లక్ష్మీ" అంటూ ఆ శవాన్ని కౌగలించుకొని విలపించింది.

# అందమైన పిల్ల

గోపాలరావును నేను కలుసుకొని చాలా సంవత్సరాలయింది. మేమిద్దరం ఒకటోఫారంనుంచీ, ఇంటర్మీడియేట్ దాకా ఒకేబల్లమీద కూచుని చదివాము. ఆ తరువాత, వాడిదారి వేరు నాదారి వేరు అయింది.

హఠాత్తుగా మొన్న సెంట్రల్ స్టేషన్‌లో కనిపించాడు. ఎవరో స్నేహితుడు కలకత్తా మెయిలులో వూరికి వెడుతూవుంటే, అతణ్ణి పంపించడానికి నేను స్టేషనుకి వెళ్ళాను. అందమైన ఆడవాళ్ళు ఎవరైనా కనిపిస్తారేమో

చూదామని, ఆఫీసు పని అయిపోగానే స్టేషనుకి వచ్చాడు గోపాలరావు.

‚‚ఏమిరోయ్, ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!” అంటూ భుజంమీద చెయ్యి వేసి నన్ను పలకరించాడు. చిన్ననాటి స్నేహితుడు కనిపిస్తే ఎవరికి ఆనందంగా వుండదు గనుక! నేను చాలా ఆనందించాను. ఒకర్ని వొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నాము. నా సంగతి అంతా వాడికి చెప్పాను. వాడు, తన సంగతి అంతా నాకు చెప్పాడు. తాను సెంట్రల్ కు యెందుకు వచ్చిందీ గోపాలరావు చెప్పినప్పుడు, నాకు ఆశ్చర్యం ఏమీ వెయ్యలేదు. చిన్నప్పటి నుంచీ, వాడి స్వభావం అంతే.

‚‚అదిగో, ఆ ఆంగ్లో యిండియన్ పిల్ల చూడరా. ఫస్టుక్లాస్ బాడీ” అనీ, “అదిగో, అయ్యంగారి పిల్ల చూడు, ఎంత షోగ్గా నడుస్తోందో!” అనీ మాటమాటకీ, ప్రతి పడుచునూ చూపిస్తూ గోపాలరావు తన్మయత్వం పొందుతూవుంటే, నేనుకూడా కొద్దో గొప్పో ఆనందం పొందకపోలేదు.

గోపాలరావును మాయింటికి రమ్మన్నాను. వాడు సరేనన్నాడు. కలకత్తా మెయిలు వెళ్లిన తరవాత యిద్దరమూ, మైలాపూర్ ట్రాము యెక్కడానికి వచ్చి, బ్రిడ్జిమీద నిలుచున్నాము. నేను ట్రాముకోసం చూస్తున్నాను.

“ఒరేయ్, చూడరా. తెలుగు పిల్లలా వుంది. అలా వుండాలి; మెడ్రాసులో వున్న తెనుగు పిల్లలంతా ‚‚యీసురో! దేవుడా” అంటూ వుంటారు కదా. అందానికి తగిన ఒడ్డు పొడుగు పొంకంకూడా అలా వుండాలిరా” అని చిన్న లెక్చరుతో, మూర్ మార్కెటు వైపునుంచి వస్తున్న పద్ధెనిమిదేళ్ళ పిల్లను చూపించాడు గోపాలరావు.

చూశాను. ఆ పిల్లను చూడగానే, నాకు కొద్దిగా నవ్వు వచ్చింది. నవ్వాను. ఆ పిల్లకూడా, నా నవ్వుచూసి ముసిముసి నవ్వుతో వచ్చి, మైలాపూర్ ట్రాంకోసమే మాకు కొంచెం దూరంలో నిలబడింది.

‚‚నిమిషంలో కత్తు కలిపావులే. వెళ్లి మాట్లాడుకో. భలే ఛాన్సు చాలా ఫార్వర్డు రకంలాగ వుంది, లేకపోతే, ఇట్టే నవ్వుతుందా!” అని నన్ను కొంచెం ప్రోత్సహించాడు గోపాలరావు.

నాకు ఏమి చెయ్యాలో తోచలేదు. కాని నవ్వు మాత్రం వచ్చింది.

ఆ పిల్ల కేసి చూసి, మళ్లీ నవ్వాను. నా నవ్వుకి, ఆ పిల్ల మళ్లీ నవ్వింది. ఆ పిల్ల చాలా చక్కనిదే అని నావుద్దేశం. పైగా, ఆ నవ్వులో ఎంతో తియ్యదనం వుందని యిప్పటికీ అనుకుంటూ వుంటాను. బహుశా, ఎప్పటికీ అనుకుంటానేమో కూడాను.

"అదృష్టవంతుడివిరా, ఛాన్సు కొట్టేశావ్. శుభస్యశీఘ్రం. పెళ్లి మాటలు కలుపుకున్నావంటే, ఎలాగైనా లాక్కుపోవచ్చును-" అని నన్ను హుషార్ చెయ్యడం ఆరంభించాడు గోపాలరావు.

ఆ సందర్భంలో ఏం చెయ్యాలో నాకు తోచలేదు.

ఇంతలో నా బాధ కొంచెం సర్దటానికి భగవంతుడు తోడ్పడినట్టుగా ట్రాము వచ్చేసింది.

ఆ పిల్ల ట్రాముయెక్కి, చివరవైపున కూచున్నది. లోపలికిపోయి కూచుంటే, సరిగ్గా ఆ మొహం చూడటానికి వీలుండదేమోనని, చివర డ్రైవరు ప్లాట్ ఫారంమీద నుంచుందామని నిర్బంధ పెట్టాడు గోపాలరావు.

అందుకు ఏమీ అభ్యంతరం పెట్టకుండా వొప్పుకున్నాను.

కండక్టరు టిక్కెట్లకోసం వచ్చాడు ఆ పిల్ల దగ్గరకు వెళ్లి అడిగాడు. నన్నడగమని చూపించింది. నాకు నవ్వొచ్చింది. గోపాలరావు ఉద్రేకం పట్టరాంపోయింది.

ఆ పిల్లకీ, నాకూ గోపాలరావుకీ మూడు టిక్కెట్లు కొన్నాను.

"పిట్ట వలలో పడిందిరా. ఇంత ఈజీ అని నేను ఎప్పుడూ అనుకోలేదు సుమా. తొణుకూ, బెణుకూ లేకుండా, నిన్ను చూపించేసిందే, మధ్య నే నెందుకూ సత్రకాయలాగ? ఏ రాయపేటలోనో దిగిపోతాను. నువ్వాపిల్లను ఎగరేసుకుపో" అని ఉపాయం చెప్పాడు గోపాలరావు.

ఏమని జవాబు చెప్పడానికీ నాకు తోచలేదు.

ఆ పిల్ల ప్రక్కన చోటు, మాంటురోడ్డులో ఖాళీ అయింది.

"పిల్ల ప్రక్కన కూచో, ఇదే మంచి సమయం, అని నన్ను ముందుకు

తోశాడు, గోపాలరావు. విధిలేక వెళ్ళి కూచున్నాను. వాడుకూడా, నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. వాడు రావడంతోనే అ పిల్ల కొంచెం సిగ్గుపడింది.

ఏం చెయ్యడానికీ తోచక, ఆ పిల్లవైపు తిరిగి ,,వీడు, నా స్నేహితుడు గోపాలరావు. రాత్రి మన ఇంట్లోనే భోజనం చేస్తాడు!" అనేశాను.

గోపాలరావు తెల్లబోయి నావైపు చూశాడు. మా ఆవిడ మాత్రం సరే నన్నట్టు తలవూపింది.

# వ్యాపారి హృదయం

‘యారికో ఒకరెడ్ ఇండియను నాయకుని కూతురు. ఆజాతి స్త్రీలలో ఆమె చాలా చక్కనిది. నాభిదగ్గరనుంచి మోకాళ్ళవరకూ, దేహాన్ని మరుగుపరచడానికి, పులిచర్మాన్ని మొలకుచుట్టుకొనేది, యారికో తలమీద, రత్నాలూ ముత్యపుచిప్పలూ కలిపికట్టి మేలుజాతి నిప్పుకోడి ఈకలుగుచ్చిన కిరీటం-కిరీటంకన్న యింకొక పేరు దానికేమీ తోచడం లేదు-పెట్టుకొనేది. రెండుచేతులకీ, అంగుళం వెడల్పుఉన్న దంతపు మురుగులూ, మెడలో దంతపు పలకలహారమూ-దంతపు పలకలమధ్య రత్నాలు తాపటము చేసి-ధరించేది. కాళ్ళకు ముత్యపు చిప్పలుకట్టిన దంతపు కడియాలు వేసుకొనేది. పొడుగైన ఆమెజుట్టూ, నీలపురాళ్ళలాగా మెరిసేకళ్లూ, ఎర్రని శరీరపురంగూ, పద్ధెనిమిదేళ్ల పాలుగారే యౌవనమూ-ఆజాతిలో అందచందాలెరిగిన యువకులందరినీ ఆకర్షించాయి. ఎంతోమంది, ఇతరనాయ తనకుమార్తె కులు ఆమెను వరించారు. యారికో ఒక్కడినీ మెచ్చుకోలేదు. అందానికి అంతమంది సాటివారు మురియడమూ, వాళ్లలో ఒక్కడినీ ఆమె వరించకపోవడమూ, వాళ్లంతా పదేపదే తన మెప్పుకోసం ప్రయత్నించడమూ, చూసి అమితంగా గర్వపడేవాడు యారికో తండ్రి. యారికో ఎప్పుడూ